cell :98663345657
PLAN TODAY
BUILD TOMORROW
PMR BUILDING PLANNER
House Planning | Building Permission | HMDA & DTCP Layout Permission
Estimation | Home Loans | Valuations | Construction Drawings
HOUSE PLANNING · BUILDING PERMISSION · HMDA & DTCP LAYOUT PERMISSION · ESTIMATION · HOME LOANS · CONSTRUCTION DRAWINGS
Smart Plans... Stronger Structures... Better Tomorrow...

# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190

నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను
నూతనంగా వెలువడుతున్న నేటి దిక్సూచి తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో క్రింద తెలుపబడిన కేటగిరీలలో విలేకరులు కావలెను.
• జిల్లా బ్యూరో లు
• జిల్లా ఇంచార్జి లు
• నియోజకవర్గ రిపోర్టర్లు
• మండల రిపోర్టర్లు
ఆసక్తి గలవారు క్రింది నంబరును సంప్రదించండి
Call : 9100900931

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :152 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ సోమవారం- 28 - సెప్టెంబర్ - 2026

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు..



అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ

అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం

ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు

వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ

అమరావతి : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. మిగతా..2లో

## ఢిల్లీలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం



దేశ రాజధానిలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి తెలిపారు.

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి తెలిపారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో దళిత, ఆదివాసీల సమస్యలు, హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై చర్చించనున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మిగతా..2లో

## దామా శేషాద్రి నాయుడు మనవడి ఉయ్యాల వేడుక.. హాజరైన మంత్రి లోకేశ్



- హైకోర్టు మాజీ న్యాయమూర్తి దామా శేషాద్రి నాయుడు మనవడి ఉయ్యాల వేడుక
- చిన్నారిని ఆశీర్వదించిన లోకేశ్
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మాజీ మంత్రి దగ్గుబాటి

అమరావతి : హైకోర్టు మాజీ న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు ఇంట జరిగిన వేడుకలో పలువురు రాజకీయ ప్రముఖులు సందడి చేశారు. ఆయన మనవడి ఉయ్యాల వేడుక కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారిని ఆశీర్వదించి, దామా శేషాద్రి నాయుడు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ

# ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం

- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు




అమరావతి : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

## 'మాటల్లో చెప్పలేని దుఃఖాన్ని మోస్తున్నాం' కరూర్ తొక్కిసలాట బాధితులకు విజయ్

- ★ విజయ్ ర్యాలీ సందర్భంగా జరిగిన ఘోర తొక్కిసలాట
- ★ ఇది మానని గాయం, తగ్గని అని పేర్కొన్న అన్న ముఖ్యమంత్రి
- ★ కరూర్ తొక్కిసలాట బాధితులకు విజయ్ నివాళి



ఢిల్లీ : తమిళనాడులోని కరూర్ తొక్కిసలాటలో మరణించిన వారికి తమిళనాడు సి. జోసెఫ్ విజయ్ నివాళులు అర్పించారు. 2025 సెప్టెంబర్ 27న కరూర్ జిల్లాలో విజయ్ ప్రసంగించిన ర్యాలీ సందర్భంగా జరిగన ఘోర తొక్కిసలాట, తమిళనాడు ఇటీవల చరిత్రలో ఒక రాజకీయ సభలో జరిగిన అత్యంత ఘోరమైన భద్రతా విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఆ విషాద ఘటన జరిగి ఒక సంవత్సరం పూర్తి కావడంతో విజయ్ ఎక్స్ లో ఓ పోస్ట్ చేశారు. "నా హృదయంలో నిలిచి ఉన్న వారందరికీ నమస్కారం. గత ఏడాది ఇదే రోజు అంటే 2025 సెప్టెంబర్ 27వ తేదీ నా జీవితంలో, మిగతా..2లో

## భారతదేశపు తొలి రైలు- జెండా ఊపి ప్రారంభించిన అమిత్ షా



- కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు తప్ప మరేమీ జరగలేదని అమిత్ షా విమర్శ
- మోదీ పాలనలో రైల్వేలో సమూల మార్పులు జరిగాయని స్పష్టం
- గత 12 ఏళ్లలో మోదీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారన్న షా

ఢిల్లీ : కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు తప్ప మరేమీ జరగలేదని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో రైల్వేలో సమూల మార్పులు జరిగాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో మోదీపై

## అల్లకల్లోలంగా సముద్రం అప్పుడే స్విమ్మింగ్ చేయడం నాకిష్టం

- ఎస్ ఐఆర్ దుమారం మధ్య రాహుల్ ఎక్స్ పోస్టు
- తన పదవికి రాజీనామా చేయాలన్న ప్రియాంక గాంధీ
- సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించిన కపిల్ సిబల్

ఢిల్లీ : "సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అందులో ఈదడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అల్లకల్లోలం కూడా ఒక రకమైన ప్రశాంతతేనని అది మనకు నేర్పుతుంది" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ఆయన ఆ వ్యాఖ్యలను ఏ ఉద్దేశంతో చేశారనేది స్పష్టంగా పేర్కొనలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన సమస్యలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారన్న అంశంపై రాజకీయ దుమారం మధ్య ఈ పోస్ట్ వెలువడింది.



### తన పదవికి రాజీనామా చేయాలి!

మరోవైపు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కేరళ మాజీ ప్రధాన కార్యదర్శికి బీజేపీ టికెట్ ఆఫర్ చేశారన్న వార్తలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సీఈసీ అధికార పార్టీకి అనుకూలంగా మిగతా..2లో

## ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తుచేసిన ప్రధాని మోదీ

- 138వ మన్ కీ బాత్ కార్యక్రమం-2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ
- భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని వెల్లడి
- జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపు



ఢిల్లీ : ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్ లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి మిగతా..2లో

## 20 ఏళ్లయినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్



- సీఎల్పీ మీడియా సెంటర్ వేదికగా ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ బీఆర్ఎస్‌పై తీవ్రంగా మండిపడ్డారు.
- ఇరవై ఏళ్ల తరువాత కూడా ఆ పార్టీ అధికారంలోకి రాదంటూ ఫైరయ్యారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 27: తెలంగాణ అస్తిత్వం అంటే అమరవీరులు మాత్రమేనని, కేసీఆర్ కాదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఈరోజు (ఆదివారం) సీఎల్పీ మీడియా సెంటర్ వేదికగా ఆయన బీఆర్ఎస్‌పై తీవ్రంగా మండిపడ్డారు. చావు నోట్లో కేసీఆర్ తలకాయ పెడితే తెలంగాణ వచ్చిందనేది అబద్ధమని చెప్పారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ ఎక్కడ తలకాయ పెట్టినా ఉపయోగం ఉండదని విమర్శించారు. తెలంగాణ అంటే తామే అన్న కల్వకుంట్ల కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి పాతాళానికి తొక్కారన్నారు. అలాగే ఈ సెప్టెంబర్‌లోనే రేవంత్ అడుగు సిరిసిల్లలో పడబోతోందని తెలిపారు. బంధువులు, అనుచరులతో కేసీఆర్ నిర్మించుకుంటున్న

## సిరిసిల్లలో బూతుల సంస్కృతి చూపించొద్దు

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్ సుదీర్ఘమైన 9 పేజీల బహిరంగ లేఖ రాశారు.
- రాష్ట్రాన్ని నడిపించే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నామన్న సంగతి మరిచిపోయి,
- ఆరోపణలు నిరూపించలేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.
- బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసి నేతన్నల పొట్టకొట్టారని మండిపడ్డారు.



హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్ సుదీర్ఘమైన 9 పేజీల బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ విఫల పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న తర్వాత తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న సీఎంకు స్వాగతం పలుకుతూనే, పర్యటనలలో ఉపయోగించే భాష, స్థానిక సమస్యలపై తీవ్రస్థాయిలో నిలదీశారు. రాష్ట్రాన్ని నడిపించే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నామన్న సంగతి మరిచిపోయి, పర్యటించిన ప్రతిచోటా బూతు పురాణాలతో ప్రత్యర్థులపై బురదజల్లే సంస్కృతిని సిరిసిల్ల పర్యటనలో ప్రదర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు 8,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని, అందులోంచి 2,400 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని గతంలో అసెంబ్లీ వేదికగా రేవంత్ చేసిన ఆరోపణలను కేటీఆర్ పచ్చి అబద్ధాలుగా కొట్టిపారేశారు. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు జిల్లాలో కేవలం మిగతా..2లో

## బీజేపీ ఓటు చోరీ చేసి మోసం చేసింది



- బీజేపీ ఓటు చోరీ చేసి ప్రజలను మోసం చేసిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు.

సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 27 : బీజేపీ ఓటు చోరీ చేసి ప్రజలను మోసం చేసిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు. నిస్సదేహంగా రాహుల్ ప్రధాని కానున్నారని చెప్పుకొచ్చారు. ఈరోజు (ఆదివారం) సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి ఉత్తమ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు.

**పేదలకు మంచి క్వాలిటీ సన్నబియ్యాన్ని అందిస్తున్నాం..**

## మొదటి పేజి తరువాయి

## ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం

వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## దామా శేషాద్రి నాయుడు మనవడి ఉయ్యాల వేడుక.. హాజరైన మంత్రి లోకేశ్

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు. ఒకే వేదికపై పలువురు రాజకీయ ప్రముఖులు కనిపించడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి లోకేశ్, ఇతర నేతలు కాసేపు ముచ్చటించుకున్నారు. వ్యక్తిగత వేడుక అయినప్పటికీ, ప్రముఖుల రాకతో రాజకీయ వర్గాల్లో ఈ కార్యక్రమంపై ఆసక్తి నెలకొంది.

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు..

ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

## బీజేపీ ఓటు చోరీ చేసి మోసం చేసింది

పేదలకు మంచి క్వాలిటీ సన్నబియ్యాన్ని తాము అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో దేనికి పనికిరాని దొడ్డు బియ్యం అందించారని.. వాటిని అందరూ అమ్ముకునేవారని అన్నారు. దేశంలో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉందని.. కానీ ఎక్కడ లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యాన్ని కాంగ్రెస్ మాత్రమే అందిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 90 శాతం మంది పేదలు సన్నబియ్యం తింటున్నారని చెప్పుకొచ్చారు.

### బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు..

బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఎందుకు ఇవ్వలేదని మంత్రి ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లాలో మూడు లక్షలపై చిలుకు కొత్త కార్డులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పది లక్షల మంది సన్నబియ్యం తీసుకుంటున్నారని వెల్లడించారు. ఈ నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తవి లక్ష పైచిలుకు కార్డులు అందించామని తెలిపారు. దీని ద్వారా మూడు లక్షల మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 20 ఏళ్లయినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ కేటీఆర్‌ను తీవ్రంగా విమర్శించారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానని చెప్పి.. కేటీఆర్ తెలంగాణ ద్రోహిగా మారారని ధ్వజమెత్తారు. 'కేటీఆర్ మమ్మల్ని బెదిరిస్తావా..? ముందు నీ భవిష్యత్తు చూసుకో. రెండేళ్లే కాదు ఇరవై ఏళ్ల తరువాత కూడా మీ పార్టీ అధికారంలోకి రాదు'అంటూ ఆయన ఫైరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు అవినీతితో సంపాదించిన డబ్బుతో విష ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో దళితుణ్ని సీఎం చేస్తానన్న కేసీఆర్.. గెలిచిన తరువాత ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దళితులకు భూమి ఇవ్వకపోగా.. వారికి ఇందిరమ్మ ఇచ్చిన భూములను బీఆర్ఎస్ నేతలు లాక్కున్నారని మండిపడ్డారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు, ప్రభుత్వ భూములు.. ఇలా వేటినీ వదలకుండా బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించారని ఆయన ఆరోపించారు. అలాంటి కోట్ల రూపాయల విలువ చేసే భూములను హైడ్రా విముక్తి చేసిందని చెప్పారు. భూములను ఆక్రమించుకున్న తెలంగాణ ద్రోహులను కేసీఆర్ పక్కన పెట్టుకుని తిరుగుతున్నారని ఆయన విమర్శించారు.

## ఢిల్లీలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం

మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు మల్లు రవి తెలిపారు. అలాగే కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానకర ఘటనపైనా చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'ఖర్గేను అవమానించడం అంటే యావత్ దళిత వర్గాన్ని అవమానించడమే' అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, సామాజిక వివక్ష, వారి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఎంపీ రవి తెలిపారు. అలాగే ఆయా అంశాలకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కోరనున్నట్లు ఎంపీ మల్లు రవి వెల్లడించారు.

## ఇకపై రీఛార్జ్ సైకిల్ 30 రోజులు- డేటా లేకుండా కాల్స్‌కు ప్రత్యేక ప్లాన్లు- ఎంపీ రాఘవ్ చడా హర్షం

**ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు 30 రోజుల రీఛార్జ్ ప్లాన్లు- ఏడాదిలో 13 సార్లు రీఛార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు- డేటా అవసరం లేనివారికి వాయిస్, ఎస్ఎంఎస్-ఓన్లీ ప్లాన్లు**

ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటివరకు 28 రోజుల చొప్పున ఉండే రీఛార్జ్ సైకిల్‌తో ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేయాల్సి వచ్చేది. ఇకపై 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఏడాదికి 12 సార్లు రీఛార్జ్ చేస్తే సరిపోనుంది. ఈ నిర్ణయంపై బీజేపీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చడా హర్షం వ్యక్తం చేశారు. టెలికాం వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. టెలికాం వినియోగదారుల రక్షణ (పదమూడవ సవరణ) నిబంధనలు, 2026 పేరుతో ఈ మార్పులను సెప్టెంబర్ 22న విడుదల చేసింది. దీని ప్రకారం టెలికాం సంస్థలు వినియోగదారులకు మరిన్ని రీఛార్జ్ ఆప్షన్లు అందించాల్సి ఉంటుంది. 28 రోజుల సైకిల్‌కు చెక్‌చాలా కాలంగా ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు 28 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని నెలవారీ ప్లాన్లుగా పరిగణించినా ఒక నెలలో సాధారణంగా 30 లేదా 31 రోజులు ఉంటాయి. దీంతో ఏడాదిలో 12 నెలలకు బదులుగా 13 సార్లు రీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఈ అంశాన్ని రాఘవ్ చడా మార్చి 11న పార్లమెంట్‌లో ప్రస్తావించారు. 12 నెలలు ఉన్న ఏడాదిలో 13 రీఛార్జ్‌లు ఎందుకు చేయాల్సి వస్తోందని ఆయన ప్రశ్నించారు. వినియోగదారులకు 30 రోజుల వ్యాలిడిటీతో కూడిన నెలవారీ రీఛార్జ్ ప్లాన్లు అందించాలని కోరారు. తాజాగా ట్రాయ్ తీసుకొచ్చిన నిబంధనల్లో 30 రోజుల వ్యాలిడిటీకి సంబంధించిన ఆప్షన్ కూడా ఉంది. దీంతో ప్రతి నెలా ఒకే తేదీన రీఛార్జ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఒక నెలలో ఆ తేదీ లేకపోతే ఆ నెల చివరి రోజున రెన్యువల్ జరిగేలా నిబంధనలు రూపొందించారు.

### డేటా అవసరం లేనివారికి ప్రత్యేక ప్లాన్లు

కొత్త నిబంధనల్లో మరో కీలక అంశం వాయిస్, ఎస్ఎంఎస్-ఓన్లీ స్పెషల్ టారిఫ్ వోచర్లు (గాుఎం). ప్రస్తుతం టెలికాం సంస్థలు అందించే చాలా రీఛార్జ్ ప్లాన్లలో వాయిస్, ఎస్ఎంఎస్‌తో పాటు డేటా కూడా ఉంటుంది. అయితే ప్రతి వినియోగదారుడికి డేటా అవసరం ఉండదు. ముఖ్యంగా ఫోన్‌లో ఇంటర్నెట్ ఎక్కువగా ఉపయోగించని వారు కేవలం కాల్స్, ఎస్ఎంఎస్ కోసం రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారికి డేటా లేకుండా వాయిస్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉండే ప్రత్యేక ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని ట్రాయ్ నిర్ణయించింది. 30 రోజులు లేదా అంతకంటే తక్కువ వ్యాలిడిటీ ఉన్న వాయిస్, ఎస్ఎంఎస్, డేటా ఎస్‌టీవీలకు అనుగుణంగా వాయిస్, ఎస్ఎంఎస్-ఓన్లీ ఎస్‌టీవీలను కూడా టెలికాం ఆపరేటర్లు అందించాల్సి ఉంటుంది.

## అల్లకల్లోలంగా సముద్రం- అప్పుడే స్విమ్మింగ్ చేయడం నాకిష్టం

### మొదటి పేజి తరువాయి

పనిచేయటం దారుణమన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. "ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, పూర్తిగా అనైతికం. మన ఎన్నికల వ్యవస్థలో, ఎన్నికలను నిర్వహించే సంస్థల్లో అత్యున్నత స్థాయిలో ఉన్న ఈ వ్యక్తులకు పార్టీల పట్ల పక్షపాతం ఉందని ఇది స్పష్టంగా చూపిస్తోంది. వారికి పార్టీ పక్షపాతం ఉండటమే కాకుండా, ఆయా పార్టీల కోసం వారు క్రియాశీలకంగా ప్రచారం కూడా చేస్తున్నారు. అలాంటప్పుడు వారు నిష్పక్షపాతంగా ఎన్నికలను ఎలా నిర్వహించగలరు? ఈ పెద్దమనిషి చేసిన పూర్తిగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన పనుల పరంపరలో ఇది ఒకటి మాత్రమే. కాబట్టి వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఢిల్లీతో పాటు ప్రతి జిల్లాలో మేం ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపాం."

**- ప్రియాంకాగాంధీ, వయనాడ్ ఎంపీ**

సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారు!

మరోవైపు, ఎస్ ఐఆర్ విషయంలో జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించిన రాజ్యసభ ఎంపీ కపిల్



సిబల్, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది నెలలుగా ఇతర ఎన్నికల కమిషనర్ల ప్రమేయం లేకుండా, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్థానిక అధికారులను పక్కనపెట్టి ఢిల్లీలోని జు.జ.× చీజు ద్వారానే ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేపట్టారని, ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండానే ఫారమ్-6లో మార్పులు చేశారని ఆయన విమర్శించారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీకి నేర విచారణ నుంచి మినహాయింపు ఉన్నందున, చట్టబద్ధమైన రక్షణ లేని జుజ× చీజు నిర్వాహకురాలు సీమా ఖన్నాపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా సాగిన ఈ నిర్ణయాల నేపథ్యంలో గత జూన్ నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఎన్నికలను రద్దు చేసే అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించాలని సిబల్ విజ్ఞప్తి చేశారు.

సీజేపీకి మద్దతు తెలిపిన సోనమ్ వాంగ్‌చుక్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న 'కాక్రోచ్ జనతా పార్టీ' తలపెట్టనున్న ఆందోళనకు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. దేశంలో జవాబుదారీతనాన్ని, ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచేందుకు జరిగే ప్రయత్నాలకు తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ ఉద్యమంలో తాను భౌతికంగా పాల్గొనకపోవచ్చున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ అనేది అత్యంత కీలకమని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఆ ప్రక్రియే దెబ్బతింటే, ఇక ప్రజాస్వామ్యానికి విలువేముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు తామిచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలన్నారు. లద్దాఖ్‌కు 6వ షెడ్యూల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను ఆయన పట్టించుకోలేదన్న మీడియా కథనాలతో దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘంలో జవాబుదారీతనం కోరుతూ అక్టోబర్ 2న సీజేపీ ముంబయిలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది.

## సిరిసిల్లలో బూతుల సంస్కృతి చూపించొద్దు: సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

### మొదటి పేజి తరువాయి

1,272 ఎకరాలు, సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమే భూపంపిణీ జరిగిందని గుర్తుచేశారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆ 8,000 ఎకరాలు ఎక్కడున్నాయి, స్వాధీనం చేసుకున్నామని చెబుతున్న 2,400 ఎకరాల సర్వే నంబర్లు, గ్రామాలు, రైతుల వివరాలతో సమగ్రమైన శ్వేతపత్రం (వైట్ పేపర్) విడుదల చేసిన తర్వాతే సిరిసిల్లలో అడుగుపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరూపించలేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. సిరిసిల్ల నేతన్నల సంక్షేమంపై లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సీఎంకు సూటి ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా రూ. 250 కోట్ల నుంచి రూ. 1,000 కోట్ల టర్నోవర్‌తో కళకళలాడిన వస్త్ర పరిశ్రమ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసి నేతన్నల పొట్టకొట్టారని మండిపడ్డారు. గతంలో ఇచ్చిన రూ. 300 కోట్ల బకాయిలకు గానూ ప్రభుత్వం ఇంకా చెల్లించాల్సిన రూ. 60 కోట్ల పెండింగ్ నిధులను ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు 10 శాతం యార్న్ సబ్సిడీని ఎప్పుడు విడుదల చేస్తారు, నేతన్న బీమాను ఎందుకు పునరుద్ధరించడం లేదు, అపెరల్ పార్కును ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. అలాగే రూ. 387.61 కోట్లతో ఏర్పాటు చేసిన వీవింగ్ పార్క్ షెడ్లను ఇతర అవసరాలకు కాకుండా నేతన్నలకే ఎప్పుడు కేటాయిస్తారో, పద్మశాలీ సంక్షేమ సంఘ భవన నిధులను ఎందుకు నిలిపివేశారో నిలదీశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ హయాంలో రూ. 90 కోట్లతో 366 ఎకరాల్లో ప్రారంభించిన ఆక్వా పార్క్, నారాయణపూర్‌లో రూ. 100 కోట్లతో చేపట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిశ్రమలను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని కేటీఆర్ నిలదీశారు. రాజన్న సిరిసిల్ల ప్రాంతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన మెడికల్



కాలేజ్, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ వంటి అనేక అభివృద్ధి పనులను కొనసాగించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా జిల్లా అభివృద్ధికి కనీసం రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించాలని, తన లేఖలోని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా కేవలం బూతులు మాట్లాడితే సిరిసిల్ల ప్రజలు తిప్పికొడతారని కేటీఆర్ హెచ్చరించారు.

## భారతదేశపు తొలి రైలు- జెండా ఊపి ప్రారంభించిన అమిత్ షా

### మొదటి పేజి తరువాయి

ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని చెప్పారు. అర్థరహితంగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీని వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ నుంచి భారతదేశపు (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ) రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో షా ప్రసంగించారు. "2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వే వ్యవస్థలో అనేక నూతన సదుపాయాలను కల్పించడంతో పాటు వాటిని ఆధునీకరించారు. మోదీ ప్రభుత్వ హయాంలో 11,000 కిలోమీటర్ల రైలు కారిడార్‌ను 4-ట్రాక్ నెట్‌వర్క్‌గా మార్చే పనులు జరుగుతున్నాయి. దీనివల్ల రవాణా ఎంతో సులువు అవుతుంది. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, ర్యాపిడ్ రైల్ సిస్టమ్, ప్రీమియం స్టేషన్లు, ఇవన్నీ మోదీ ప్రారంభించినవే. అంతేకాక, హైడ్రోజన్‌తో నడిచే రైలును కూడా ఆయనే ప్రారంభించారు. దీని ద్వారా సాంకేతికత కలిగిన టాప్ 4 దేశాల సరసన భారత్‌ను నిలబెట్టారు. సరుకు రవాణాను సులభతరం చేసి, రవాణా సామర్థ్యం పెంచేందుకు ముంబయి నుంచి వడోదరకు నడిపిన మొదటి 'లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు' ట్రయల్ రన్ విజయవంతమైంది."



**- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**

**'ఆత్మనిర్భర్ భారత్' భావనలను బలోపేతం చేసిన మోదీ**

మోదీ ప్రభుత్వం, రైళ్లలో 97 శాతం బయో-టాయిలెట్లను ఏర్పాటు చేసిందని, అలాగే 87 శాతం గాుదీ కోచ్‌లను భారతదేశంలోనే తయారు చేశారని అమిత్ షా పేర్కొన్నారు. వీటితో పాటు రైల్వే విద్యుదీకరణ 70 శాతానికి పెరిగిందని, రైల్వే భద్రతకు సంబంధించి బడ్జెట్ 67 శాతం పెరిగిందని, అలాగే లోకోమోటివ్ (ఇంజిన్) తయారీ సామర్థ్యం కూడా 66 శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' భావనలను మోదీ బలోపేతం చేశారని చెప్పారు. '2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి ఇది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి ఇది సున్నాకి చేరుతుంది. ఫలితంగా విదేశీ కరెన్సీని ఆదా చేయగలుగుతాం' అని షా పేర్కొన్నారు. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగ్గా, 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగిందని షా చెప్పారు. అంతేకాదు, రైల్వే శాఖ 99.6 శాతం విద్యుదీకరణను పూర్తి చేసిందని, మిగిలిన 0.3 శాతాన్ని కూడా తాము పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుదీకరణ విషయంలో చైనాలో 92 శాతం, స్పెయిన్‌లో 68 శాతం, ఫ్రాన్స్‌లో 60 శాతం, బ్రిటన్ వంటి దేశంలో 49 శాతం పురోగతి ఉంది. కానీ, భారత్‌లో మాత్రం దీన్ని 100 శాతానికి చేర్చే దిశగా తాము ముందుకు సాగుతామని షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.1500 కోట్లకు పైగా విలువైన ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు. వీటిలో రైలు మార్గాల డబ్లింగ్ పనులు, రైలు ప్రమాదాలను నివారించే కవచ్ రక్షణ వ్యవస్థ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, ఔూ+-12 ఎలక్ట్రిక్ లోకోమోటివ్ నిర్వహణ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం- 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తుచేసిన ప్రధాని మోదీ

### మొదటి పేజి తరువాయి

ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రవాదుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

### జనగణనపై ప్రజలకు పిలుపు

'మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

### డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

### మోధేరా గ్రామం ప్రస్తావన

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24×7 సోలార్ విలేజ్ గా మారడాన్ని ఆయన అభినందించారు. అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోధేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో



ఒక్కసారైనా మోధేరాను సందర్శించాలని ఆయన కోరారు. మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఢిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

### అశోక్ సింఘాల్‌కు నివాళి

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని ఆయన కృషికి సంబంధించిన ఫలితంగా అభివర్ణించారు.

## 'మాటల్లో చెప్పలేని దుఃఖాన్ని మోస్తున్నాం'- కరూర్ తొక్కిసలాట బాధితులకు విజయ్ నివాళి

మా కరూర్ బంధువుల జీవితాల్లోనూ, అలాగే తమిళనాడులోని మా ఆత్మీయుల హృదయాల్లోనూ మానని గాయంగా, చెరిగిపోని వేదనగా మిగిలిపోయిన ఒక విషాదకరమైన రోజు. మేము అంటే మేము, మా కరూర్ బంధువులు, అలాగే 'తమిళనాడు విక్టరీ అసోసియేషన్'కు చెందిన ఆత్మీయులు, అందరం కలిసి మాటల్లో చెప్పలేని దుఃఖాన్ని మోస్తున్నాం. మన హృదయాల్లో నిలుపుకున్న ఆత్మీయులను కోల్పోయి శోకిస్తున్న మనకు, మనమే పరస్పరం ఓదార్పుగా, అండగా, ఆశ్రయంగా నిలుద్దాం. జ్ఞాపకాలుగా నిలిచిపోయిన ఆ ఆత్మీయులందరికీ హృదయపూర్వక నివాళులు."

- విజయ్ , తమిళనాడు ముఖ్యమంత్రి

ప్రభుత్వ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు స్టే

మరోవైపు, కరూర్ తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు నెల ప్రారంభంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. జస్టిస్ జెబీ పర్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఆ అంశాన్ని పరిశీలించింది.

ఉపాధి కల్పించకుండా ఎందుకు?

తొక్కిసలాట ఒక దురదృష్టకర ఘటన అని, ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోయారని ధర్మాసనం పేర్కొంది. ఈ ఘటనతో ప్రభావితమైన కుటుంబాలకు సహాయంగా ఉపాధి కల్పించకుండా ప్రభుత్వాన్ని ఎందుకు నిరోధించాలని ప్రశ్నించింది. మరణించిన వ్యక్తి కుటుంబానికి ఏకైక సంపాదనాపరుడిగా ఉన్న సందర్భంలో, బాధిత కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వం ఉపాధి కల్పించకుండా ఎందుకు నిరోధించాలని ధర్మాసనం ప్రశ్నించింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించే అంశాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది.

హైకోర్టు ఏం చెప్పిందంటే?

మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ జులై 27న బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు ఉన్నారని హైకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16 కింద ఉన్న హామీలకు ఈ నిర్ణయం విరుద్ధంగా ఉంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. కరూర్ బాధితుల కుటుంబాల కోసం ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక విభాగాన్ని సృష్టించగలదా అనే అంశాన్ని కూడా పరిశీలించింది. ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాలతో పాటు కార్యనిర్వాహక అధికారాలు కూడా రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండాలని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

బంగారు ఉంగరాల పథకానికి విజయ్ శ్రీకారం

ఇదిలా ఉండగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించే పథకానికి సీఎం విజయ్ సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. మదురైలోని రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆసుపత్రి ఆడిటోరియంలో 25 మంది నవజాత శిశువులకు విజయ్ బంగారు ఉంగరాలను అందజేస్తారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే బాలింతలు తమిళనాడు శాశ్వత నివాసులై ఉండాలని అధికారులు తెలిపారు. అలాగే గర్భధారణ, శిశు పర్యవేక్షణ వ్యవస్థలో నమోదు అయి ఉండటంతో పాటు =జ౧ ఐడీ కూడా కలిగి ఉండాలని చెప్పారు. తల్లి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో ప్రత్యేక సీరియల్ నంబర్ కలిగిన ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్‌లో ఉంగరాన్ని అందజేస్తామని అధికారులు వివరించారు. ఈ పథకం కోసం తమిళనాడు ప్రభుత్వం రూ.755 కోట్లు కేటాయించింది. తొలి విడతలో 1.28 లక్షల బంగారు ఉంగరాలను సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులు, శిశువులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు బంగారు ఉంగరాలను అందించే ఈ పథకం ద్వారా ప్రభుత్వ

నేటి దిక్సూచి
సోమవారం- 28 - సెప్టెంబర్ - 2026

# ఆదిలాబాద్ జిల్లా టీపీసీసీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్‌గా చందనగిరి శ్రీనివాస్ నియామకం..



మంచిర్యాల,..మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చందనగిరి శ్రీనివాస్‌కు పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను ఆదిలాబాద్ జిల్లా టీపీసీసీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు మనకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి, అలాగే ఎస్సీ వర్గాల సంక్షేమానికి శ్రీనివాస్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యలపై పోరాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ధర్మ జాగరణ ఆధ్వర్యంలో ఘనంగా గ్రామ దేవాలయ అర్చక శిక్షణా తరగతులు ప్రారంభం..

వారం రోజుల పాటు మందమర్రి శ్రీ హరిహర అయ్యప్ప దేవాలయంలో శిక్షణ..

ఆగమ శాస్త్రోక్తంగా పూజా విధానాలపై అర్చకులకు అవగాహన..



మందమర్రి :గ్రామీణ ప్రాంతాల్లో హిందూ ధర్మ పరిరక్షణ,సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా ధర్మ జాగరణ తెలంగాణ ప్రాంతం, మంచిర్యాల జిల్లా (కరీంనగర్ విభాగం) గ్రామ దేవాలయ అర్చక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ దేవాలయ అర్చక శిక్షణా తరగతులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.? మందమర్రి మార్కెట్ సమీపంలోని శ్రీ హరిహర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 03 వరకు వారం రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆగమ శాస్త్రోక్తంగా పూజా విధానాలు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామాల్లోని ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కావని, అవి గ్రామీణ సమాజానికి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రాలని పేర్కొన్నారు.గ్రామ దేవాలయాల్లో నిత్య ధూప,దీప, నైవేద్యాలు లోటు లేకుండా నిర్వహించడంతో పాటు,అర్చకులకు ఆగమ శాస్త్రోక్తంగా పూజా విధానాలు, మంత్రోచ్ఛారణలు, ప్రాచీన సంప్రదాయాలపై ఈ వారం రోజుల్లో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు వివరించారు. అర్చకుల నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఆలయాల విశిష్టతను కాపాడవచ్చని వారు అభిప్రాయపడ్డారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో ధర్మ జాగరణ ప్రతినిధులు, అర్చక పరిషత్ బాధ్యులు,వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అర్చకులు, స్థానిక అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అక్రమ ఇసుక తరలింపు

## రెండు ట్రాక్టర్లు పట్టివేత



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గోవర్‌గూడ అటవీ శివారు, దేవాయిగూడ బీట్, చోపిడి రిజర్వ్ ఫారెస్ట్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం అర్ధరాత్రి అటవీ అధికారులు పట్టుకున్నారు. దేవాయిగూడ ఎఫ్‌ఎస్‌ఓ జి. భీంరావు, ఎఫ్‌బీఓలు జె. అనిల్, కె. సుమన్ ఈ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లోని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రేంజ్ అధికారి రామాదేవి స్పష్టం చేశారు. తిర్యాణి మండల లబ్ధిదారులు చిర్రాకుంట ఇసుక రీచ్ నుంచి, రెబ్బెన మండల లబ్ధిదారులు గంగాపూర్ ఇసుక రీచ్ నుంచి మాత్రమే ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇసుక తరలించుకోవాలని, నిర్ణీత సమయం దాటి తరలిస్తే నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించారు. అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కర్జెల్లి గూడెం రోడ్డు మరమ్మతుల డిమాండ్‌తో బీఆర్ఎస్ నిరసన



:కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో కర్జెల్లి నుంచి గూడెం వరకు దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు, గర్భిణులు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. 2025 జూలై 18న ఎమ్మెల్యే హరీశ్ బాబు రూ.1.50 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ప్రకటించి, వర్షాలు తగ్గిన వెంటనే వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటివరకు పనులు మొదలుకాలేదని నాయకులు ఆరోపించారు. రోడ్డుపై వేసిన నల్ల మట్టి వర్షాలకు బురదగా మారుతోందని, దీంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా నిలిచిపోయాయని తెలిపారు.వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని, కేటాయించిన రూ.1.50 కోట్ల నిధుల వివరాలు బహిర్గతం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చింతలమానేపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ప్లాట్.. రెండు అనుమతులు!

మూసారాంబాగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణం?

ఫిర్యాదు చేసినా స్పందించని టౌన్‌ప్లానింగ్ అధికారులు!

క్షేత్రస్థాయి పరిశీలనపై స్థానికుల డిమాండ్





మలక్‌పేట్, నేటి దిక్సూచి : ఒకే స్థలానికి రెండు వేర్వేరు భవన నిర్మాణ అనుమతులు.. క్షేత్రస్థాయిలో మాత్రం రెండు అనుమతులను కలిపి భారీ నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు.. మంజూరైన ప్రణాళికకు భిన్నంగా అదనపు నిర్మాణం జరిగిందనే ఫిర్యాదులు.. ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు.. ఇవన్నీ మూసారాంబాగ్ పరిధిలోని ఓ నిర్మాణంపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. చార్మినార్ జోన్, మూసారాంబాగ్ సర్కిల్--29 పరిధిలోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, ప్లాట్ నంబర్ 16--11లో నిర్మాణంపై వివాదం నెలకొంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. ఒకే ప్లాట్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా చూపిస్తూ 2025 ఏప్రిల్ 17న రెండు వేర్వేరు భవన నిర్మాణ అనుమతులు మంజూరైనట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. సంబంధిత ఫైల్ నంబర్లు గా పేర్కొంటున్నారు.




## అనుమతులు వేరు.. నిర్మాణం ఒక్కటేనా?

రెండు అనుమతుల్లోనూ స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు అనుమతి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణం మాత్రం అనుమతులకు భిన్నంగా సాగిందని ఫిర్యాదులో ఆరోపించారు. రెండు భాగాలను కలిపి నిర్మాణం చేపట్టడంతో పాటు సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించలేదని, అదనపు అంతస్తు కూడా నిర్మించారని ఫిర్యాదుదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఫిర్యాదుపై చర్యలు ఎక్కడ?

నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయంటూ సోషల్ రిఫార్మర్, విజిల్‌బ్లోయర్ ఆధారాలతో ఎ ం బ ం ది, త ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, అదనపు అంతస్తుకు సంబంధించిన అంశాలను ఫిర్యాదులో ప్రస్తావించినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిగిందా? నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా? ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



## ఉన్నతాధికారులు స్పందించాలి

భవన నిర్మాణ అనుమతులు జారీ చేసిన తర్వాత నిర్మాణం మంజూరైన ప్రణాళిక ప్రకారమే జరుగుతోందా లేదా అన్నది పర్యవేక్షించడం టౌన్‌ప్లానింగ్ విభాగం బాధ్యత. అలాంటప్పుడు ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నప్పటికీ నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న ఫిర్యాదులు ఎందుకు వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# మన్ కీ బాత్ వీక్షణ, నల్లగొండ శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించిన హరీష్ బాబు



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు భాజపా కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ శ్రవణ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే హరీష్ బాబు పరామర్శించారు. ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రవణ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో దహెగాం మండల భాజపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ఎఐటీయుసి మద్దతు




బ్యాంకు ఉద్యోగులు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు చేపట్టనున్న దేశవ్యాప్త మూడు రోజుల సమ్మెకు ఎఐటీయుసి కుమురం భీం జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లలో భాగంగా వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న పని గంటలు, అధిక పనిభారం, లక్ష్యాల ఒత్తిడి కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరతను నివారించాలని, ఉద్యోగులపై అధిక లక్ష్యాల పేరుతో ఒత్తిడి తగ్గించాలని కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు జిల్లాలోని కార్మికవర్గం మద్దతుగా నిలవాలని ఎఐటీయుసి నాయకులు కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవి నవరాత్రుల ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల గోడపత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. డా. శ్రీ దేవార వినోద్ స్వామి, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్, గ్రామ సర్పంచ్ దరావత్ అరుణ కృష్ణ, ఉప సర్పంచ్ మిట్ట వెంకటేష్ కలిసి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, దుర్గాష్టమి రోజున మహా చండీ హోమం, విజయదశమి రోజున వాహన పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజయదశమి సాయంత్రం అమ్మవారి పల్లకి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు..

# భీమారంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు.



భీమారం,.భీమారం మండల కేంద్రంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలి కుల బాంధవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ఆయన స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి లో పాల్గొన్న టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు.



పోరు తెలంగాణ మంచిర్యాల .కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి ని పురస్కరించుకొని మంచిర్యాల ఐడిఓసి కార్యాలయంలో క్రాంతి కిరణ్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి పాల్గొనగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడానికి చేసిన సేవలు మరవకూడదని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి తొలిదశ మలి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి చేసిన ఉద్యమ స్ఫూర్తిని తెలంగాణ ప్రజలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అదేవిధంగా మంచిర్యాలలో బైపాస్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటు కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలపడం జరిగినది. ఈ జయంతి కార్యక్రమంలో టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు ఉపాధ్యక్షులు, కేజీయా రాణి , సత్యనారాయణ బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# 120 కుటుంబాల సమిష్టి కలయిక.. ఆత్మీయతను పంచుకున్న మందమర్రి పద్మశాలీలు





మందమర్రి, : ఆత్మీయ పలకరింపులు.. ఆనందోత్సాహాలు.. కుటుంబ సభ్యుల సందడి మధ్య పద్మశాలి కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. మందమర్రి మండలంలోని అమ్మగార్డెన్, మంజునాథ హిల్స్ ప్రాంతాలకు చెందిన సుమారు 120 కుటుంబాలు ఆదివారం పులిమడుగులోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి.పద్మశాలి కుల బాంధవుల మధ్య ఆత్మీయత, ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులు ఒకచోట చేరి పరస్పరం కలుసుకుని తమ అనుబంధాలను పంచుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.చిందం చంద్రకాంత్, బత్తుల శ్రీనివాస్, అనుమండ్ల సుధాకర్, పల్లెర్ల సమ్మయ్య, తడక రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కుటుంబ సభ్యులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, తమ అనుభవాలను పంచుకుంటూ సందడిగా గడిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు కుల బాంధవుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు పరస్పర సహకారం, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్ తరాల మధ్య కూడా ఆత్మీయ సంబంధాలు కొనసాగేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగిన ఈ సమ్మేళనం కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

# రాష్ట్ర స్థాయి కరాటే, కుంపు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




సింగరేణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే, కుంపు ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. పుల్లూరి భరత్‌నంద కటా విభాగంలో కాంస్య పతకం, బెబ్బటి శివాన్ష్ కార్తికేయన్ తన విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. అలాగే బూరం నితీష్, పిరిసింగుల అశ్విత్ కుంపు విభాగాల్లో స్వర్ణ పతకాలు, కృష్ణ పాశ్వన్ కుంపు విభాగంలో కాంస్య పతకం సాధించారు. వీరు కరాటే మాస్టర్ ఎం. దేవయ్య, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వి. రవి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థుల విజయాలపై సెయింట్ క్లారెట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపాల్ సిస్టర్ అభినందనలు తెలిపారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని మాస్టర్ దేవయ్య తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

# ఈ నెల 28న లక్కీడ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక

మంచిర్యాల మండల తహసిల్దార్ రఫతుల్లా

మంచిర్యాల,:నిరుపేదలకు ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల పథకంలో భాగంగా ఈనెల 28వ తేదీన లక్కీ డ్రా పద్ధతిన పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని మంచిర్యాల మండల తహసిల్దార్ రఫతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో లక్కీ డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని,రెండు పడక గదుల ఇండ్లలో బ్లాక్, ఫ్లోర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.లబ్ధిదారులు మాత్రమే ప్రవేశానికి అర్హులని,ఇతరులకు అనుమతి ఉండదని, లబ్ధిదారులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు.ఇండ్ల కేటాయింపు అనంతరం లబ్ధిదారులలో ఉన్నట్లుగా వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందినట్లయితే సమగ్ర విచారణ చేపట్టి అనర్హులకు కేటాయించిన ఇండ్లు రద్దు చేయడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎవరికైనా అభ్యంతరాలు,ఫిర్యాదులు ఉన్నట్లయితే నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

# కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా వందనం..



మంచిర్యాల,.. కాంగ్రెస్ సేవాదళ్ విభాగం ఆధ్వర్యంలో నాలుగో ఆదివారం నిర్వహించే జెండా వందనం కార్యక్రమం మంచిర్యాల పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు హఫీజ్ రహమాన్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వరరావు పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో సేవాదళ్‌కు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని అన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి సేవాదళ్ ప్రజల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రతి నెల నాలుగో ఆదివారం సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెండా వందనం కార్యక్రమం జాతీయ భావాలను, దేశభక్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.జాతీయ జెండా పట్ల గౌరవం,రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి వంటి అంశాలను ప్రతి ఒక్కరిలో పెంపొందిం చాల్సిన అవసరం ఉందని అన్నారు. సేవాదళ్ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అరిగేల పద్మ,రామంచి వనజ రాణి,లింగమూర్తి, రాజయ్య,పోషం, రాయమల్లు,మనోజ్,రవి, రాజమల్లు,తదితరులు పాల్గొన్నారు.

# స్క్వాష్?లో డబుల్ సిల్వర్- బాక్సింగ్?లో మెడల్స్ కన్ఫర్మ్ ఎనిమిదోరోజు హైలైట్స్ ఇవే

**ఆసియా గేమ్స్? 2026**

ఎనిమిదో రోజు హైలైట్స్- భారత ఖాతాలో పలు పతకాలు- మన క్రీడాకారుల ముఖ్యమైన ఈవెంట్లు, ఫలితాలు ఇవే!

ఆసియా క్రీడల్లో ఎనిమిదో రోజు భారత్ ఖాతాలో పలు పతకాలు వచ్చి చేరాయి. స్క్వాష్? మహిళల, పురుష సింగిల్స్? విభాగాల్లో భారత్ అథ్లెట్లు సిల్వర్ మెడల్స్ సాధించారు. అంతేకాకుండా మరికొందరు అథ్లెట్లు ఆయా క్రీడల్లో పతకాలు ఖాయం చేసుకున్నారు. మరి ఇవాళ (ఆదివారం) ఆసియా గేమ్స్?లో మన అథ్లెట్ల ప్రదర్శన ఎలా సాగింది? ఏయే విభాగాల్లో పతకాలు సాధించారో తెలుసుకుందాం!



### అనాహత్ రికార్డ్

స్క్వాష్‌లో మహిళల సింగిల్స్ ఈవెంట్?లో అనాహత్?కు రజత పతకం వచ్చింది. అయితే ఇప్పటికే ఫైనల్?కు క్వాలిఫై అయిన అనాహత్ గోల్డ్ మెడల్ పోరులో ఓడిపోయింది. మలేసియాకు చెందిన శివసంగరి సుబ్రమణియమ్ 11- 4, 4- 11, 7- 11 తేడాతో అనాహత్?ను ఓడించింది. దీంతో రెండో స్థానానికి పరిమితమైన అనాహత్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక ఇదే ఆటలో పురుషుల సింగిల్స్?లోనూ భారత్?కు సిల్వర్ మెడల్ వచ్చింది. ఫైనల్లో అభయ్‌సింగ్ నిరాశపర్చాడు. అతడు కూడా మలేసియాకు చెందిన ఇయాన్ యోవ్ చేతిలో వరుస సెట్లలో ఓడిపోయాడు. 11- 9, 11- 5, 11- 5 తేడాతో అభయ్?పై ఇయాన్ గెలుపొంది గోల్డ్ పట్టేశాడు. దీంతో అభయ్?కు సిల్వర్ మెడల్ వచ్చింది. దీంతో అభయ్?కు సిల్వర్ మెడల్ వచ్చింది. దీంతో ఈ విభాగంలో భారత్ నుంచి సౌరవ్ గోషల్? తర్వాత పతకం సాధించిన రెండో అథ్లెట్?గా నిలిచాడు.

### కాంస్యం నెగ్గిన హరిత

మహిళల 200 మీటర్ల పరుగు పందెంలో భారత క్రీడాకారిణి హరిత భద్ర కాంస్యం ముద్దాడింది. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో జపాన్‌కు చెందిన అబిగెయిరుపుకా ఇడోను ఓడించి హరిత కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలో 23.20 సెకన్ల సమయంతో హరిత మూడో స్థానంలో నిలించింది. ఇక ఇండోనేసియాకు చెందిన శాంతి పెరీరా (22.78 సెకన్లు) తొలి స్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకోగా, చైనాకు చెందిన యుజీ చెన్ (22.93 సెకన్లు) రజతం సాధించింది.

### పతకం ఖాయం

ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు బాక్సింగ్‌లో మొదటి పతకం ఖాయమైంది. 80 కేజీల విభాగంలో అంకుష్ పంగల్ పురుషుల క్వార్టర్‌ఫైనల్‌లో నెక్రుజ్ సలీమోవ్ (తజికిస్థాన్)ను 5- 0 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. దీంతో అతడికి పతకం ఖాయమైంది. అయితే ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన తొలి సీజన్?లోనే పంగల్ పతకం ఖాయం చేసుకున్నాడు. అలాగే మహిళల సింగిల్స్?లో 60 కేజీల మహిళల విభాగంలో పర్వీన్ హుడా కూడా సెమీస్‌కు చేరుకుంది. దీంతో ఆమెకు కూడా మెడల్ కన్ఫర్మ్ అయ్యింది.

### మరికొన్ని ముఖ్యమైన ఈవెంట్లు

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్? క్వార్టర్స్?లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఓడిపోయింది. ఆమెపై చెన్ యుఫి (చైనా) 21-11, 18-21, 10-21 తేడాతో నెగ్గింది ఇదే విభాగంలో మరో మ్యాచ్?లో ఉన్నతి హుడాకు కూడా నిరాశ ఎదురైంది. క్వార్టర్?ఫైనల్?లో యమగుచిని ఢీ కొట్టిన ఉన్నతి 16-21, 21-14, 17-21 తేడాతో పరాజయం పాలైంది భవానీ దేవి, శ్రేయ గుప్తా, జెఫార్లిన్ సిమ్లాతో కూడిన భారత ఫెన్సింగ్ జట్టు క్వార్టర్ ఫైనల్‌లో ఉజ్బెకిస్థాన్ చేతిలో 35-45 తేడాతో ఓడిపోయింది 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్?లో ఇషా సింగ్, మను బాకర్, రాణి సర్ణోబత్ ర్యాపిడ్ రౌండ్?కు క్వాలిఫై అయ్యారు ఆర్చరీ రికర్వ్?లో భారత మహిళల, పరుషుల జట్లు సెమీఫైనల్స్?కు దూసుకెళ్లాయి. అంకిత, కృతి, మిహిర్?తో కూడిన మహిళల త్రయం తైవాన్? జట్టుపై 6-0 తేడాతో నెగ్గింది. ఇక సంజయ్, ధీరజ్, నీరజ్? జట్టు చైనాను 5-1తో ఓడించింది

# క్వార్టర్స్?లో సింధు ఓటమి ఆసియా క్రీడల్లో భారత్?కు తీవ్ర నిరాశ ఈసారి ఒక్క పతకమే

**ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్?లో ముగిసిన భారత్ పోరాటం- సింగిల్స్? క్వార్టర్ ఫైనల్స్?లో సింధు, ఉన్నతి ఓటమి**



2026 ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ విభాగంలో? భారత్? పోరాటం ముగిసింది. ఈసారి బ్యాట్మింటన్?లో భారత్?కు తీవ్ర నిరాశ మిగిలింది. ఆదివారం మహిళల సింగిల్స్?లో ఒలింపిక్స్ పతక విజేత పీవీ సింధు, మరోవైపు 19ఏళ్ల ఉన్నతి హుడా క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయి ఇంటిబాట పట్టారు. దీంతో ప్రస్తుత ఆసియా గేమ్స్?లో భారత్? బ్యాడ్మింటన్ జర్నీ ముగిసింది. భారీ అంచనాలతో దిగిన మన బ్యాడ్మింటన్ జట్టు కేవలం ఒక్క పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

### పోరాడి ఓడిన సింధు

క్వార్టర్ ఫైనల్?లో సింధు చైనాకు చెందిన చెన్ యుఫిని ఢీ కొట్టింది. ఈ మ్యాచ్?లో 21-11, 18-21, 10-21 తేడాతో సింధు ఓడిపోయింది. అయితే తొలి సెట్?లో సింధుదే అధిపత్యంగా సాగింది. గత మ్యాచ్?లో జోరు కొనసాగిస్తూ, తొలి సెట్?ను 21-11తో దక్కించుకుంది. దీంతో గేమ్ పూర్తిగా సింధు కంట్రోల్?నే ఉందనిపించింది. కానీ, ఆమె ప్రత్యర్థి చెన్ రెండో సెట్?లో అద్భుతంగా పుంజుకుంది. సింధుకు గట్టి పోటీనిచ్చింది. అయినప్పటికీ సింధు పోరాటం ఆపలేదు. ధీటుగా బదులిచ్చింది. కానీ ఆఖరికి 18-21తో స్వల్ప తేడాతో సెట్ కోల్పోయింది. దీంతో ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అయితే ఈ చివరి సెట్?లో సింధు పూర్తిగా తేలిపోయింది. ఏమాత్రం ప్రభావం చూపలేదు. దీంతో చెన్ 10-21 తేడాతో ఈ సెట్?ను దక్కించుకొని మ్యాచ్?లో నెగ్గింది.

### వరుసగా మ్యాచ్?ల వల్లేనా?

ఈ క్రీడల్లో సింధు భారీ అంచనాలతో దిగింది. ఆమె పక్కా పతకం సాధిస్తుందని అంతా నమ్మకంగా ఉన్నారు. ఆ అంచనాలకు తగ్గట్లే ప్రారంభ రౌండ్స్, ప్రీ క్వార్టర్స్?లో అదరగొట్టింది. ఈ మ్యాచ్?లోనూ తొలి సెట్?లో ఆమెదే పైచేయి. అయితే వరుసగా సింధుకు మ్యాచ్?లు ఉండడం వల్ల ఆమె అలసిపోయిందని వాదనలు వినిపిస్తున్నాయి. సింధు శనివారం రెండు మ్యాచ్?లు ఆడింది. మళ్లీ ఇవాళ ఉదయాన్నే బరిలోకి దిగింది. ఈ లెక్కన 24 గంటల్లో ఆమె మూడు మ్యాచ్?లు ఆడింది. అలా కంటిన్యూగా మ్యాచ్?లు ఉండడం వల్లే సింధు అలసిపోయందని నెటిజన్లు భావిస్తున్నారు.మరోవైపు జపాన్?కు చెందిన యమగుచితో తలపడ్డ ఉన్నతి 16-21, 21-14, 17-21 తేడాతో పరాజయం పాలైంది. అయితే ఉన్నతి పోరాటం మాత్రం అభిమానులను ఆకట్టుకుంది. హోరాహోరీగా జరిగిన తొలి సెట్?ను 16-21తో కోల్పోయినా, రెండో సెట్?లో సత్తా చాటింది. మంచి కమ్?బ్యాక్ ఇచ్చి 21-14 తేడాతో సెట్?ను దక్కించుకుంది. ఇక మూడో సెట్?లోనూ హోరాహోరీ తప్పలేదు. కానీ చివర్లో యమగుచి 17-21 తేడాతో ఆటను గెలుచుకుంది.

# 64 బంతుల్లోనే 174 రన్స్- కట్‌చేస్తే టీమ్‌ఇండియాలో చోటు ఎవరీ నమన్ ధీర్

**వెస్టిండీస్?తో వన్డే సిరీస్?- అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నమన్ ధీర్ - క్యాప్ అందించిన కెప్టెన్ శుభ్?మన్ గిల్**

టీమ్‌ఇండియా వన్డే జట్టులోకి కొత్త కుర్రాడు వచ్చాడు. స్వదేశంలో వెస్టిండీస్?తో వన్డే సిరీస్?తో 26ఏళ్ల నమన్ ధీర్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. తిరువనంతపురం వేదికగా జరగుతున్న తొలి మ్యాచ్?లో నమన్?కు తుది జట్టులో చోటు దక్కింది. అతడికి కెప్టెన్ శుభ్?మన్ గిల్ డెబ్యూ క్యాప్ అందించాడు. ఈ క్రమంలో నమన్ ధీర్ డొమెస్టిక్ రికార్డులు ఎలా ఉన్నాయి? ఐపీఎల్?లో గణాంకాలు ఏంటి? అనే విషయాలపై ఓ లుక్కేద్దామా?విండీస్?తో వన్డే సిరీస్?కు ఈ నెల ప్రారంభంలోనే ప్రకటించిన టీమ్‌ఇండియా జట్టులో తొలిసారి నమన్ సెలక్టర్ల పిలుపు అందుకున్నాడు. ఇక మూడు మ్యాచ్?ల సిరీస్?లో తొలి వన్డేలోనే అతడికి తుది జట్టులో చోటు దక్కడం విశేషం. అయితే నమన్ తన కెరీర్?లో ఇప్పటిదాకా 14 లిస్ట్?ఏ మ్యాచ్?లు ఆడాడు. ఇందులో 11 ఇన్నింగ్స్?లో బ్యాటింగ్ చేశాడు. ఇందులో 351 పరుగులు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 97 పరుగులు ఉంది. ఇక బౌలింగ్?లోనూ ఫర్వాలేదనిపించాడు. మొత్తం ఏడు వికెట్లు పడగొట్టాడు. అలాగే దేశవాళీ టీ20ల్లో (పంజాబ్ రాష్ట్ర జట్టు, లిస్ట్ ఏ, ఐపీఎల్?) కలిపి 61 మ్యాచ్?లు ఆడాడు.



### ఐపీఎల్?తో ఫేమస్

2024 తర్వాత నమన్ ధీర్ ఐపీఎల్? టోర్నమెంట్?తోనే ఫేమస్ అయ్యాడు. ఆ టోర్నీలో ముంబయి ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. మిడిలార్డర్?లో ధనాధన్ హిట్టింగ్?లో నమన్?కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ?2024లో ఐపీఎల్?లో అతడు అరంగేట్రం చేశాడు. ఆ సీజన్?లో లీగ్? ఆఖరి మ్యాచ్?లో లఖ్?నవూ సూపర్ జెయింట్స్?పై 28 బంతుల్లోనే 62 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇప్పటిదాకా 37 మ్యాచ్?లు ఆడాడు. ఇందులో 710 పరుగులు చేశాడు. రీసెంట్?గా 2026 సీజన్?లో 14 మ్యాచ్?ల్లోనూ బరిలోకి దిగాడు. ఇందులో 318 రన్స్ చేసి ఫర్వాలేదనిపించాడు.

### 64 బంతుల్లోనే 173 పరుగులు

**ఆ ఇన్నింగ్స్?తోనే సెలక్టర్ల దృష్టిలో!**

అయితే కొద్దిరోజులుగా నమన్ ధీర్ వేలే లెవల్? ఫామ్?లో ఉన్నాడు. ఇటీవల జరిగిన షేర్ ఏ పంజాబ్ టీ20 లీగ్?లో అద్భుతంగా ఆడాడు. ఈ లీగ్?లో అమృత్?సర్ సుర్మాస్? జట్టుకు నమన్ ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో 10 మ్యాచ్?ల్లో ఏకంగా 655 పరుగులు బాదాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడుసార్లు 50ం స్కోర్లు ఉన్నాయి. ఇక 217.6 స్ట్రైక్ రేట్ నమోదు చేయడం విశేషం. మరీ ముఖ్యంగా ౯ాజూా స్టేడియంలో సెప్టెంబర్ 08 నాడు మొహాలి కింగ్స్?తో మ్యాచ్?లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్?లో కేవలం 64 బంతుల్లోనే 173 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడు సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు.

# ఫోన్ దిండు కిందే పెట్టుకుని నిద్ర పోతున్నారా..? అయితే ప్రమాదమే!

**నిద్రించే సమయంలో ఫోన్ దిండు కిందే పెడుతున్నారా..?**

**అయితే ఆ అలవాటు వెంటనే మానుకోవాలంటున్నారు నిపుణులు.**

**ఫోన్ దిండు కిందే పెట్టుకుని నిద్ర పోతున్నారా..? అయితే ప్రమాదమే!**



ఇంటర్నెట్ డెస్క్: ఈరోజుల్లో సెల్‌ఫోన్ ఆరో ప్రాణం లాంటిదని ఊరికే అనలేదు. నిద్రలేచిన దగ్గర నుంచి మళ్లీ నిద్రపోయే వరకూ చాలామంది ఫోన్‌ను వదలరు. కొందరైతే నిద్రలో కూడా వదలరు. దాన్ని దిండు కింద పెట్టుకుని నిద్రిస్తారు. దీని వల్ల ఎప్పుడూ మొబైల్ అందుబాటులోనే ఉంటుందని భావిస్తారు. దగ్గరగా ఉంటే అలారం బాగా వినిపిస్తుందని అనుకునేవారూ ఉన్నారు. అయితే ఇలా చేయడం ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు.

### ఆ రేడియేషన్ ప్రమాదకరం

మొబైల్ ఫోన్ల నుంచి రేడియేషన్ విడుదలవుతుందన్న విషయం తెలిసిందే. ఈ రేడియేషన్ ప్రమాదకరమైంది. ఇది ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. వైద్య నిపుణుల ప్రకారం.. మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ వల్ల మెదడులో కణితులు ఏర్పడే ప్రమాదముంది. అలాగే పలు క్యాన్సర్లు రావడానికి అవకాశముంది. దిండు కింద ఫోన్ పెట్టుకుని నిద్రిస్తున్నప్పుడు రేడియేషన్ నేరుగా తలకు చేరుకుంటుంది. దీని వల్ల తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి.

### ఈ సమస్యలూ వస్తాయి..

దిండు కింద పెట్టడం వల్ల ఫోన్లకు కూడా ఎంతోకొంత నష్టం జరుగుతుంది. సాధారణంగా గాలి ప్రసరించే ప్రదేశాల్లో ఫోన్ ఉంచాలి. దిండు కింద పెట్టిన్నప్పుడు గాలి ప్రసరణ లేక అది వేడెక్కుతుంది. ఇలా తరచూ ఓవర్ హీట్ అయితే మొబైల్ బ్యాటరీ దెబ్బతింటుంది. ఇక ఛార్జింగ్ పెట్టినప్పుడు ఫోన్‌ను దిండు కింద ఎట్టిపరిస్థితుల్లో పెట్టకూడదు. అలాంటి సందర్భాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా అది పేలిపోయే ప్రమాదముంది. నిద్రపోతున్నప్పుడు మీ ఫోన్‌ను దిండు కింద పెట్టే బదులు, దానిని మీ మంచానికి కొంచెం దూరంలో ఉన్న టేబుల్‌పై ఉంచడం మంచిది.

# మెనోపాజ్ సమయంలో జీర్ణ సమస్యలు? ఈ జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు!

**మహిళల్లో మెనోపాజ్ - కేవలం మూడ్ స్వింగ్స్ మాత్రమే కాదు, కడుపుబ్బరం కూడా!**

మహిళల జీవితంలో మెనోపాజ్? సర్వసాధారణమైన దశ. ఈ సమయంలో శరీరంలో ఎన్నో రకాల మార్పులు చోటు చేసుకుంటాయి. నిద్రలేమి, అలసట, మూడ్? స్వింగ్స్, వేడి ఆవిర్లు, ఎముకల బలహీనత వంటి లక్షణాలతో పాటు చాలా మందిని ఇబ్బంది పెట్టే మరో సమస్య జీర్ణక్రియ మందగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తిన్న ఆహారం సరిగా అరగకపోవడం, కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం, కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన వంటివి ఈ సమయంలో కనిపిస్తాయని అంటున్నారు.



### ఎందుకిలా

మెనోపాజ్?లో ప్రొజెస్టరాన్, ఈస్ట్రోజన్ హార్మోన్ల స్థాయిలు తగ్గుతాయి. ఈ హార్మోన్ల మార్పులు జీర్ణ వ్యవస్థ పనితీరుపైనా ప్రభావం చూపుతాయి. శరీరంలో జీర్ణక్రియ వేగం తగ్గడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, కండరాల చలనం మందగించడం వల్ల ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అంతేకాదు, ఈ దశలో నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వంటివి పెరిగి జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.తిన్న తర్వాత నడక మంచిదట! - ఎందుకు? - నడవకపోతే ఏం జరుగుతుంది?

### ఏం చేయాలి?

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు ఈ సమస్యను చాలా వరకు తగ్గించగలవు. ఈ క్రమంలో ఒకేసారి ఎక్కువగా తినొద్దు. బదులుగా రోజులో నాలుగు లేదా ఐదు సార్లు కొద్దికొద్దిగా తీసుకోవడంతో పాటు నెమ్మదిగా నమిలి తినాలి. అన్నం, రొట్టెలతో పాటు తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, మొలకలు వంటివి తీసుకోవాలి. ఇవి మలబద్ధకాన్ని తగ్గించడమే కాకుండా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా, మజ్జిగ, ఇడ్లీ, దోశ వంటి తేలికగా జీర్ణమయ్యే ఆహారాలు డైట్?లో చేర్చుకోవాలంటున్నారు. అయితే, పాలు లేదా పాల పదార్థాలు తీసుకున్న తర్వాత గ్యాస్, ఉబ్బరం పెరిగితే డాక్టర్లు సలహా తీసుకోవాలి. వీటితో పాటు రోజూ తగినన్ని నీళ్లు తాగడం కూడా అత్యంత అవసరం. ఉదయం గోరువెచ్చని నీరు, భోజనం తర్వాత కొద్దిసేపు నడక జీర్ణక్రియకు తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. కనీసం 30 నిమిషాలు యోగా, నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం మంచిదంటున్నారు.

### ఏం వద్దు? :

ఎక్కువ కాఫీ, టీ, చక్కెర పానీయాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, మసాలా, అధికంగా వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇవి కడుపు మంట, గ్యాస్, ఆమ్లత్వంను పెంచే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మెనోపాజ్ సహజ దశే అయినా, ప్రతి అసౌకర్యాన్ని దాని పేరుతో వదిలేయడం సరికాదు. ముఖ్యంగా, ఆహారం అరగకపోవడం నిరంతరం కొనసాగితే, తీవ్రమైన కడుపునొప్పి, రక్తస్రావం, వాంతులు, కారణం లేకుండా బరువు తగ్గడం, మింగడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇక ఆలస్యంగా చేయకుండా డాక్టర్?ను సంప్రదించాలని సూచిస్తున్నారు. అప్పుడే మెనోపాజ్?ను ఇబ్బందులు లేకుండా దాటేయొచ్చని సలహా ఇస్తున్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815